కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదు..

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 22: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి..పేదలకు అందిన సంక్షేమ పథకాలను ప్రజలు మర్చిపోలేదని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మాజీ కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో సుపరిపాలన సాగిందని, ప్రతి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ఇప్పటికే ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. భవిష్యత్ జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. స్థానిక నాయకులు కాలనీలు, బస్తీల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి ప్రభాకర్, ఆయా కాలనీల బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతల సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కష్టకాలంలో.. పేదలకు అండగా..

కష్టకాలంలో పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురానికి చెందిన పి.అజ్జేశ్వరి భర్త రాంబాబుకు.. రూ.75వేల సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్ఓసీ లెటర్‌ను అందించారు.

అమ్మవారి సేవలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పాపన్నపేట: మెదక్ జిల్లా ఏడుపాయల దుర్గమ్మ ఆలయాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం దర్శించుకున్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో మంజీరా నదిలో వరద పారుతున్నది. ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకున్నది. దీంతో ఎమ్మెల్యే రాజగోపురంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకరశర్మ, పార్తివశర్మ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్,అక్టోబర్ 22:ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం(సర్కిల్) డివిజన్ పరిధిలోని కైసర్‌నగర్‌లో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉండటంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయాన్ని కైసర్‌నగర్ వాసులు ఇటీవల మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, జిల్లా ఇంచార్జీ మంత్రి శ్రీధర్‌బాబు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వం తరపున సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15.50 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మహ్మద్ తౌసీఫ్, జమీల్‌పాషా, జబ్బార్, రాములు, దావూద్, సలీం, రంగయ్య, ఫయాజ్, హబీబ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో అయ్యప్ప మాలధారుడి మృతి

బుచ్చిబాబు మృతదేహం

దుండిగల్, అక్టోబర్ 22: గుండెపోటుతో అయ్యప్ప మాలధారుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. భౌరంపేట్ ప్రణీత్‌హోంలో నివాసం ఉంటున్న బుచ్చిబాబు(47) ఇటీవల అయ్యప్పమాలధారణ ధరించాడు. తనతో పాటు మరికొంత మందితో కలిసి సన్నిధానంలో ఉంటున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున తోటి స్వాములు లేచిన అనంతరం బుచ్చిబాబును లేపే ప్రయత్నం చేయడంతో ఎంతకి లేవలేదు. కాగా, హుటాహుటిన దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

దుండిగల్, అక్టోబర్ 22 : ఐదేళ్ల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన ఓ నిందితుడిని దుండిగల్ పోలీసులు రిమాండ్‌కు తరలించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీకి చెందిన 30 ఏండ్ల యువకుడు తన స్నేహితుడి కూతురు ఐదేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన ఈనెల 18న చోటుచేసుకోగా, 19న వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కుమ్రం భీం జయంతి

దుండిగల్, అక్టోబర్ 22:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇంద్రన్న కాలనీలో విప్లవ వీరుడు కుమ్రం భీం జయంతిని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, మండల నాయకులు ఆశి యాదయ్య, శేషయ్య, సైదులు, ఖాజా, రసీద్, లక్ష్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పబ్‌లు, బార్లపై ఆకస్మిక తనిఖీలు

మాదాపూర్, అక్టోబర్ 22:పబ్‌లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసిన ఘటన మంగళవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన ప్రకారం.. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 17 పబ్‌లలో లైసెన్స్‌లతోపాటు పోలీస్ అనుమతులు, బార్లలో సౌండ్ పొల్యూషన్ జీహెచ్ఎంసీ పర్మిషన్లను సైతం తనిఖీ చేశారు. అన్ని పబ్‌లకు లైసెన్సులు ఉన్నప్పటికీ కొన్ని పబ్‌లకు మాత్రం పోలీస్ పర్మిషన్లు లేవని తెలిపారు. పోలీస్ అనుమతులులేని పబ్‌లకు ఈనెల 23న నోటీసులను అందజేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతులిచ్చి లిక్కర్ సప్లై చేసిన గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్ కాలనీ డివిజన్ దత్తాత్రేయనగర్‌లో రూ. 17లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీలో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ వెంకటేశ్ తెలిపారు. – మియాపూర్, అక్టోబర్ 22



లింక్‌రోడ్లతో ట్రాఫిక్ సమస్యను అధిగమించాలి

అధికారుల సమీక్షలో చర్చిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,అక్టోబర్22 : కుత్బుల్లాపూర్‌లో లింక్‌రోడ్లను వెలుగులోకి తీసుకొచ్చి వాటిని వెంటనే అభివృద్ధి చేసి ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆయా విభాగాల అధికారులకు సూచించారు. మంగళవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఆర్‌డీసీఎల్), కుత్బుల్లాపూర్–గాజులరామారం జంట సర్కిళ్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్‌హెచ్–44 హనుమాన్ టెంపుల్ ఫాక్స్‌సాగర్ మీదిగా రాంరెడ్డినగర్ ఇండస్ట్రియల్ ఏరియా వరకు రూ.29 కోట్లు, కైసర్ నగర్ హనుమాన్ రెండి ఎల్లమ్మ బండ, మహాదేవపురం వెంట ర్నరీ హస్పిటల్ వరకు రూ.30 కోట్లతో లింకు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనుండగా దీంతో పాటుగా భూదేవిహిల్స్ లింకురోడ్డు పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. లింక్ రోడ్లను సకాలంలో అభివృద్ధి చేయాలని, దీని ద్వారా ప్రధాన రోడ్లపై నిత్యం ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులకు సూచించారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, జంట సర్కిళ్ల డీసీలు నరసింహ, మల్లారెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సురేందర్‌రెడ్డి, టీపీఎస్ రమేశ్, న్యాక్ ఇంజినీర్లు, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులు జెరెమయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో వ్యర్థాలు తొలగించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 22:వర్షంనీటి నాలాల్లో మట్టిని, వ్యర్థాలను తొలగించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని బోయిని చెరువు నాలాలో పూడికతీత పనులను కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. వర్షంనీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా నాలాల్లోని వ్యర్థాలను తొలగించాలన్నారు. ఏఈ ఆశ, నేతలు ఉన్నారు.

వందశాతం స్వచ్ఛత సాధించడమే లక్ష్యం

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 22 : వందశాతం స్వచ్ఛతను సాధించడమే లక్ష్యంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టినట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. మంగళవారం జోన్ పరిధిలోని మూసాపేట, కూకట్‌పల్లి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా జడ్సీ మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన పేరుకుపోయిన సీఅండ్‌డీ వేస్ట్(భవన నిర్మాణ వ్యర్థాలు), గార్బేజ్ వ్యర్థాలను తొలగించే పనులను చేపట్టినట్లు తెలిపారు. వారం రోజులుగా మూడు సర్కిళ్ల పరిధిలో కలిపి 255.5 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించామని, 56.4 టన్నుల పేరుకపోయిన/పాత చెత్తను తొలగించినట్లు తెలిపారు. త్వరలోనే గాజుల రామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో స్పెషన్ శానిటేషన్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

వ్యర్థాల ఏరివేత పకడ్బందీగా జరగాలి

మియాపూర్, అక్టోబర్ 22:డంప్ యార్డులో వ్యర్థాల ఏరివేత ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని చందానగర్ డీసీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. స్వచ్ఛ ఆటోలు డంప్ యార్డు బయట వ్యర్థాలను వేయకుండా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను రాంకీ సంస్థకు రూ.2లక్షల అపరాధ రుసుమును విధించినట్లు పేర్కొన్నారు. పారిశుధ్య విభాగంపై ఇక్కడి కార్యాలయ ఆవరణలోని కల్యాణ మంటపంలో ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు, రాంకీ సంస్థ ప్రతినిధులు, వైద్యాధికారి డాక్టర్ రవితో కలిసి డీసీ మంగళవారం సమావేశం నిర్వహించారు. డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇండ్ల వద్దనే చెత్తతోపాటు ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను వేరు చేసుకోవాలని, స్వచ్ఛ ఆటోలు డంప్ యార్డు వద్ద కింద వేయవద్దన్నారు. దీప్తిశ్రీ నగర్ డంప్ యార్డులో తాగునీరు, టాయిలెట్లు, అన్నపూర్ణ క్యాంటీన్ వంటి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సర్కిల్ వ్యాప్తంగా 52 ప్రాంతాల్లో చెత్త వేస్తున్నట్లు గుర్తించినట్లు, వాటిని నెలలోగా పూర్తిగా నిరోధించాలని డీసీ పేర్కొన్నారు. వారంతపు సంతల వద్ద పారిశుధ్య చర్యలను పకడ్బందీగా చేపట్టాలని, సంత ముగిసిన వెంటనే వ్యర్థాలను సేకరించి తరలించాలని ఆదేశించారు. డాక్టర్ రవి, ఎస్ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

- కంచె చేనును మేసిన చందంగా అక్రమార్కులకు అండగా ఉద్యోగులు, సిబ్బంది..
- డీ.పోచంపల్లిలో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

దుండిగల్,అక్టోబర్ 22:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మ–దుండిగల్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. కంచె చేనును మేసిన చందంగా రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే కొందరు సిబ్బంది, ఉద్యోగులే అక్రమార్కుల వెనుక ఉండి ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల దసరా పండుగ సెలవులతో పాటు రెండు మూడు రోజులపాటు వరుస సెలవులు రావడంతో డీ.పోచంపల్లిలోని సర్వే 120లో పలు నిర్మాణాలు చోటు చేసుకున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మండల రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్న తహసీల్దార్, గిర్దావర్ వంటి మండల ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి రాకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా తమ కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తున్న ఓ గ్రామస్థాయి అధికారి అన్నితానై ఇటీవల పదుల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తున్నది. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. పత్రికల్లో కథనాలు రాస్తే ఏమవుతుంది.. అధికారులేమైనా నన్ను కాదని చర్యలు తీసుకుంటారా? అనే మాటలు సైతం సదరు ఉద్యోగి బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. కొన్ని నిర్మాణాలకు జీవో 59 పేరిట తప్పుడు పత్రాలు సృష్టించి నిర్మాణాలు చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అంటే వేరే ప్రాంతంలో మంజూరైన పట్టాలను చూపి మరో చోట నిర్మాణాలు చేపడుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

డీ.పోచంపల్లిలోని సర్వే నంబర్ 120లో నిర్మించిన నిర్మాణం

బౌరంపేట్‌లోని సర్వేనంబర్ 576లో ఏర్పాటు చేసిన షెడ్డు

బౌరంపేట్‌లోనూ...

మండల పరిధిలోని బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ సమీపంలోనూ ఇలాంటి దందానే జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సర్వే నంబర్ 576 ప్రభుత్వ భూముల్లోనూ ఇలాటి నిర్మాణాలే జరుగుతున్నట్లు తెలుస్తున్నది. దసరా సెలవులను అడ్డుపెట్టుకుని నిర్మాణాలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఇద్దరు నియోజకవర్గం నేతల అండదండలతో నిర్మాణాలు జరుగుతుండటంతోనే అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది.

రౌడీగ్యాంగ్‌లను అడ్డు పెట్టి నిర్మాణాలు..

గండిమైసమ్మ–దుండిగల్ మండలం, డీ.పోచంపల్లిలోని సర్వే నంబర్ 120 ప్రభుత్వస్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న భూభకాసురులు సరికొత్త రీతిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. తాము నిర్మిస్తున్న అక్రమాల వైపు ఎవరూ రాకుండా రౌడీ గ్యాంగ్‌లను ఏర్పాటు చేసి అటుగా వచ్చే వారిపై నిఘా పెడుతున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా అటువైపుకు జనాలను వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. పైగా వివరణ కోరేందుకు తహసీల్దార్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ జరుగుతున్న భూ ఆక్రమణలపై ఆర్‌డీవో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మియాపూర్-ఇస్నాపూర్‌కు మెట్రో నిర్మాణం చేపట్టండి

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే గాంధీ, తదితరులు

మియాపూర్, అక్టోబర్ 22: మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో నిర్మాణాన్ని విస్తరించాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కోరారు. నాగాపూర్ నమూనా ప్రకారం.. ఒకే పిల్లర్‌పై ఫ్లైఓవర్ సహా మెట్రో మార్గాన్ని నిర్మించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను అధిగమించవచ్చునన్నారు. మాజీ ఎమ్మెల్యే హన్మంతరావుతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబును అసెంబ్లీ ప్రాంగణంలో పీఏసీ చైర్మన్ గాంధీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మెట్రో నిర్మాణంపై విన్నవించారు. రెండింటినీ వేర్వేరుగా నిర్మించడం ద్వారా ఆస్తుల సేకరణ ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉన్నందున నాగపూర్ విధానాన్ని ఇక్కడ అనుసరించాలని గాంధీ కోరారు. కాగా, మంత్రి సానకూలంగా స్పందించినట్లు గాంధీ పేర్కొన్నారు.

బల్దియా కమిషనర్‌ను కలిసిన గాంధీ

బల్దియా నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలంబర్తిని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులలో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయడంపై కమిషనర్‌తో గాంధీ చర్చించారు. గాంధీ వెంట కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ నేత రఘునాథ్‌రెడ్డి ఉన్నారు.

మురికినీళ్లను శుద్ధిచేసి.. మూసీని ప్రక్షాళన చేయాలి

ఫతేనగర్‌లో బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో ఎంపీ ఈటల రాజేందర్

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 22 :చెరువులోకి వెళ్లే మురుగునీళ్లను శుద్ధి చేసిన తర్వాత.. మూసీ నదిని ప్రక్షాళన చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఫతేనగర్ డివిజన్‌లో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో ఎంపీ ఈటల పాల్గొని మాట్లాడారు. ఎంపీగా గెలిచిన తర్వాత 4 నెలల కాలంలో ఢిల్లీకి వెళ్లినప్పుడు తప్పా... ప్రతిరోజు నియోజకవర్గంలో తిరుగుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్‌ను, హెచ్ఎండీఏ కమిషనర్‌ను, జలమండలి ఎండీని కలిసినా డబ్బులు లేవనే సమాధానం వస్తుందని, ప్రజా సమస్యను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. హైడ్రా ఉద్దేశం వేరే ఉందని నేను చెప్పిన మాటలు ప్రజలు నమ్ముతున్నారన్నారు. మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, చేస్తున్న పద్ధతికి వ్యతిరేకం అన్నారు. చెరువులలో రసాయన వ్యర్థాలు కలువకుండా శుద్ధి చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై కొట్లాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నేతలు మాధవరం కాంతారావు, శ్రీకర్‌రావు, రామ్మోహన్‌రావు, కృష్ణగౌడ్, నాగిరెడ్డి, భిక్షపతి, ఐలయ్య, విజయ్‌కుమార్, కృష్ణయ్య, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కార దిశగా అడుగులు

మాదాపూర్, అక్టోబర్ 22: సమస్యల పరిష్కార దిశగా తెలంగాణ సంఘాల ఉమ్మడి వేదిక ద్వారా త్వరలోనే హైదరాబాద్‌లోని అన్ని సంఘాల రాష్ట్ర అధ్యక్షులతో, జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామని టీఆర్‌పీఎస్ వైద్య సంఘాల ఫౌండర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం టీఆర్‌పీఎస్, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల గ్రేటర్ హైదరాబాద్ ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కార దిశగా తెలంగాణ సంఘాల ఉమ్మడి వేదిక ద్వారా త్వరలోనే హైదరాబాద్‌లోని అన్ని సంఘాల రాష్ట్ర అధ్యక్షులతో, జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఎమ్మెల్సీ కోదండరాం ద్వారా వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి సమస్యలను వివరించి పరిష్కార దిశగా అందరికి మేలు జరిగే విధంగా పనిచేస్తామన్నారు. జీహెచ్ఎంసీ అధ్యక్ష,కార్యదర్శులు, డాక్టర్లు జాఫర్, ఖాన్, శివరాజ్, గణేశ్, సునీత, రాధిక, జయశ్రీ, సుజాత, నాగమణి, వసంత, మాధవి తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకట్‌రెడ్డి

చెరువులో మురుగు నీరు కల్వకుండా చర్యలు

మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని నాయినమ్మ కుంట చెరువు సుందరీకరణ పనులపై ఇరిగేషన్ అధికారులతో కలిసి బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు , కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మంగళవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. నాయినమ్మ కుంటలోకి మురుగు నీరు కల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుకట్ట పటిష్టతతోపాటు వాకింగ్ ట్రాక్, పచ్చదనంతో చెరువు పరిసరాలు ఆహ్లాదంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ తెలిపారు. చెరువు పరిసరాలలో ఉండే నివాసితులు వ్యర్థాలను చెరువుల్లో వెయ్యవద్దని, వాటి పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ పావని పాల్గొన్నారు. – మియాపూర్, అక్టోబర్ 22

ఇన్‌కాయిస్‌లో హై పర్ఫామెన్స్ కంప్యూటర్ సిస్టం ప్రారంభం

దుండిగల్, అక్టోబర్ 22: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్ సమీపంలోని ఇన్‌కాయిస్(భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం)లో హైపర్ఫామెన్స్ కంప్యూటర్ సిస్టంను మంగళవారం కేంద్ర ప్రభుత్వ భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ కార్యదర్శి డా.ఎం.రవిచంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిస్టం ద్వారా ఇన్‌కాయిస్ అందిస్తున్న సేవలు తీర ప్రాంత ప్రజలకు, ప్రభుత్వాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన ఇన్‌కాయిస్ రూపొందించిన అట్లాస్, విజన్ డాక్యుమెంట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ టి.శ్రీనివాస కుమార్, శాస్త్రవేత్తలు బాలకృష్ణన్ నాయర్, పట్టాభి రామారావు, సుధీర్, ఉదయ్ భాస్కర్, అనీష్, అన్నపూర్ణయ్య, నాగరాజుకుమార్, ఎస్.నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, దేవేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైపర్ఫామెన్స్ కంప్యూటర్ సిస్టం ప్రారంభిస్తున్న కేంద్రప్రభుత్వ భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ కార్యదర్శి రవిచంద్రన్

అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్‌కు ఆర్థిక సాయం

అనారోగ్యంతో (కిడ్నీ సమస్య) బాధపడుతున్న జర్నలిస్ట్‌కు రూ. 50వేల ఆర్థిక సాయమందించి ఉదారతను చాటుకుంది టీయూడబ్ల్యూజే శేరిలింగంపల్లి యూనియన్. నీలగిరి పత్రికలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌రావు గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆయనకు మంగళవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకుల చేతులమీదుగా చెక్కును అందేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. – కొండాపూర్, అక్టోబర్ 22

టీఐఎఫ్ఆర్‌ను సందర్శించిన సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు

గోపన్‌పల్లిలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సెంటర్‌ను మంగళవారం రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన సంక్షేమ మహిళా కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు సందర్శించారు. టీఐఎఫ్ఆర్ పరిశోధన సంస్థలో అందుబాటులో ఉన్న అధునాతన పరిశోధన కేంద్రాలను సందర్శించి ల్యాబ్‌లు పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. విజ్ఞానశాల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'షీ ఫర్ స్టెమ్' అనే కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక, గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలల నుంచి ఎంపిక చేసిన పలువురు విద్యార్థులు టీఐఎఫ్ఆర్ సంస్థను సందర్శించారు. టీఐఎఫ్ఆర్ హైదరాబాద్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎం.కృష్ణమూర్తి విద్యార్థులకు పరిశోధన పద్ధతులను వివరించి అవగాహన కల్పించారు. విజ్ఞానశాల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, అక్టోబర్ 22

పాఠశాల విద్యార్థుల దాతృత్వం..

కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్ ఓ స్కూల్ విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకున్నారు. తమ తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో అందరూ కలిసి ఒక్కచోట వేసి వరదల వలన సర్వం కోల్పోయిన ముంపు ప్రాంత విద్యార్థులకు తోడుగా నిలిచారు. 4వేల నోట్‌పుస్తకాలను కొనుగోలు చేసి పాఠశాల ప్రిన్సిపాల్ లయన్ చింతల మల్లేశం చేతులమీదిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి, మెంబర్ ఏవీ రావు, యూత్ చైర్మన్ మణిదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22

పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలి

పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పని చేయాలని, రోడ్లపై చెత్తాచెదారం, వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్‌లో పారిశుధ్య కార్మికుల స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాలనీలు, బస్తీలలో ప్రధాన రోడ్లపై చెత్తచెదారాన్ని పూర్తిగా తొలగించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మహ్మద్ ఖాజా, మహేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ నర్సింగ్‌రావు, ఎస్ఎఫ్ఏ పాండునాయక్, భోళా శంకర్, పారిశుధ్య కార్మికులు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 22

సీసీరోడ్డు పనులు పరిశీలన

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో రూ.50లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర సబీహాబేగం అధికారులతో కలిసి పరిశీలించించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలను అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారుకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు,నాయకలు అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు. – అల్లాపూర్,అక్టోబర్22

బీఆర్ఎస్వీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేయాలి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్వీ శ్రేణులతో కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్వీ క్రియాశీలకంగా పనిచేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత,బీఆర్ఎస్వీ మాజీ ప్రధాన కార్యదర్శి,దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ సూచనల మేరకు మంగళవారం బీఆర్ఎస్వీ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ హాజరై బీఆర్ఎస్వీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ ప్రెసిడెంట్ అఖిల్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ నాయక్, సందీప్, దినేశ్, కిరణ్, రతన్, రాజు, సందీప్, మోసిన్, రోషన్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Suryanarayana Reddy Pulagam** is owner of H.No. 5-85/30/B, Land admeasuring 900 Sq.yds., Plot No. 30/B in survey No. 5/3, situated at Raidurg Panmaktha Village, Serilingampally Mandal, Ranga Reddy District who acquired the same vide Registered Release Deed No. 17785/2024, Dated 30-09-2024. The Original Link Document Registered Sale Deed No. 23743/2006, Dated 16-11-2006 is Lost.

Whosoever has found the above mentioned Original Document and whoever has got any claims or rights over the above mentioned property, please Contact: J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from Date of publication of this notice.